క్లుప్తంగా

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



వీధి వ్యాపారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జపానంద స్వామి

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమంలో స్వామి వివేకానంద 161 వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవాశ్రమాధిపతి జపానంద స్వామిజీ వివేకానంద చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివేకానందపై రచించిన భక్తి గీతాలు ఆలపించారు. ఉప నిషత్తులను పఠించారు. ఈ సందర్భంగా కూరగాయలు, ఆకు కూరలు విక్రయించే 30 మంది మహిళా వ్యాపారులకు ఉన్ని దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వివేకానంద ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు రోగుల పిల్లలకు నూతన దుస్తులు అందించారు. 30 మంది సంచారి జాతుల వారికి సంక్రాంతి కానుకగా నిత్యావసరాలతో పాటు ఉన్ని దుప్పట్లు అందించారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే

మడకశిరరూరల్: బుళ్లసముద్రం గ్రామంలో శనివారం సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించామని మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, కార్యదర్శి మారుతి ప్రసాద్ తెలిపారు. గ్రామంలో మురుగుకాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. రోడ్డులోకి ఇంటిలో నుంచి మురుగునీరు వదలకుండా ఇంటి యాజమానికి నోటీసు అందించారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

21న ఉచిత గుండె వైద్య శిబిరం

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈనెల 21న ఎమ్మెల్యే శంకరనారాయణ సహకారంతో కిమ్స్ సవీరా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి



నారాయణప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండలంలోని వడిగేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శుక్రవారం రాత్రి చిలమత్తూరు మండలం కొడూరు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ శనివారం గొల్లపల్లి గ్రామానికి చేరుకొని నారాయణప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, నాయకులు శంకర్‌నాయక్, గోవిందరెడ్డి, గొల్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు .

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలో పులేకమ్మ ఆలయం వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎగువగడ్డకు చెందిన ఆదినారాయణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఆదినారాయణ సోమందేపల్లి వైపు నుంచి 44వ జాతీయ రహదారి మీదుగా పెనుకొండకు వస్తుండగా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతడు కింద పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూదం ఆడితే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్ బాబు

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లిలో ఎస్‌ఐ రమేష్ బాబు గ్రామస్తులతో సమావేశం నిర్వహిచంఆరు. సంక్రాంతి పండగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. జూదం, కోడిపందెం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పని హెచ్చరించారు.

ఇంటింటా సంక్రాంతి

హిందూపురం/పెనుకొండ/మడకశిర సాక్షి బృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఇళ్ల ముందు భోగి మంటల్లో వివిధ వస్తువులు వేసి అగ్నిదేవుడి సాక్షిగా చెడు కర్మలను తొలగించి పుణ్యగతులను సిద్ధంపజేయాలని వేడుకున్నారు. అలాగే మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి, అందులో గొబ్బెమ్మలు పెట్టి , పసుపు, కుంకుమ పూసి, వాటికి తంగేడు, గుమ్మడి, చామంతి పూలు పెట్టి పూజలు చేశారు. చిన్నారులు మైదానాల్లో గాలిపటాలు ఎగురవేశారు. నువ్వులు, వేరుశనగ విత్తనాలు, బెల్లంతో తయారు చేసిన పిండి వంటలు, సజ్జ రొట్టెలు కుటుంబసభ్యులతో కలసి ఆరగించారు. పండుగ సందర్భంగా లేపాక్షి దేవాలయంలో పర్యాటకుల సందడి చోటు చేసుకుంది. ఈ సందర్భంగా దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పెనుకొండ: పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



పెనుకొండ: రంగవల్లులు కొంటున్న యువకులు





పెనుకొండ: అనపకాయలు, వేరుశనక్కాయలు విక్రయిస్తున్న దృశ్యం, దుకాణాల వద్ద జనం సందడి



హిందూపురం: మోడల్ కాలనీలో భోగి మంట







కొత్తమార్కెట్ వద్ద చెరుకులు, వేరుశనగ, ఇతర వస్తువుల విక్రయాలు , గాంధీ సర్కిల్ వద్ద పూల విక్రయాలు, మెయిన్ బజారులో రంగులు కొంటున్న మహిళ

గ్రామస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని సన్మానిస్తున్న కన్వీనర్ నాగేంద్రయాదవ్, నాయకులు

మడకశిరరూరల్: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సచివాలయ ఇన్‌చార్జీలు, కన్వీనర్లు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సూచించారు. శనివారం అదిరెడ్డి పాళ్యంలో మడకశిరరూరల్ జగనన్న సచివాలయ మండల కన్వీనర్ నాగేంద్రయాదవ్ నాయకులతో కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో జగనన్న సచివాలయ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు నాయకులు, కార్యకర్తలతో కలిసి సమిష్టిగా ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి కష్టపడి పని చేయాలన్నారు. మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు బాబిరెడ్డి, వైఎస్సార్‌షీపీ మండల బీసీ ,ఎస్సీ సెల్ నాయకులు సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి,శివన్న, హరీష్, మంజునాథ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

స్త్రీ విద్య కోసం అబూబకర్ పోరాటం



అబూబకర్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

పావగడ: స్త్రీ విద్య కోసం సారా అబూబక్కర్ తన రచనల ద్వారా పోరాటం చేశారని కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి తెలిపారు. స్థానిక గురుభవన్ మైదానంలో శనివారం నిర్వహించిన అబూబకర్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. మనోవ్యాకులతకు గురైన మహిళల బతుకులను తన రచనల్లో అనావరణించారు. అనేక సంవత్సరాలు సామాజిక పోరాటాలు చేసి తన 40వ ఏట అబూబకర్ రచయితగా మారిందన్నారు. లంకేశ్ పత్రికలో తను రచించిన చంద్రగిరి తీరంలో అనే నవల ధారావాహిక గా ప్రచురించారన్నారు. 10 నవలలు, 6 కథా సంకలనాలు తదితర వ్యాసాలను రచించి అనేక ప్రశస్తిలను పొందారన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజబాబు, అంతర గంగ శంకరప్ప, రామచంద్రప్ప, చెన్నబసణ్ణ, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి రూ.50,116 విరాళం



విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

హిందూపురం: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో నూతన నిర్మించిన రాతి శివాలయ నిర్మాణ ప్రారంభానికి వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి రూ.50,116 విరాళంగా అందజేశారు. జిల్లాలోనే ఎక్కడలేని విధంగా పెద్దలందరూ కలసి పట్టణానికే తలమణికంగా నిర్మించిన రాతి శివాలయ మరింత అభివృద్ధిచెంది ప్రజలందరికి శివుడి కృపా కటాక్షాలు ఉండాలనిఆయన కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు



జూదరులను అరెస్టు చేసిన దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని చాకర్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారం మేరకు పేకాట కేంద్రంపై ఎస్‌ఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. రూ.5,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడుల్లో కానిస్టేబుళ్లు అఫ్జల్, జగన్ నాయక్, రంగా హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ధనుర్మాసం చివరి రోజు శనివారం గోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం దంపతుల సమక్షంలో అర్చకులు వేదమంత్రాల నడుమ గోదాదేవికి కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలను చైర్మన్ దంపతులు సమర్పించారు. అన్నమయ్య సేవా మండలి సభ్యులు పొరాళ్ల పుల్లయ్య శిష్యులు అన్నమాచార్య సంకీర్తనలతో భక్తులను ఆకట్టుకున్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గోదాదేవి కల్యాణోత్సవం జరిపిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి



తిరుప్పవాడ సేవలో శ్రీవారు



హిందూపురం టౌన్: భోగి పండుగను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పేట వేంకటరమణస్వామి ఆలయంలో తిరుప్పవాడ సేవ ఘనంగా నిర్వహించారు. స్వామికి ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, అలంకరణ, అర్చన, ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్నప్రసాద నైవేద్యంతో శ్రీవారి రూపానికి పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.